ఇందిర
దంతవైద్యశాల
సెల్: 99083 22007

Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)
స్థాపకులు: నెల్లూరు వెంకట్రామానాయుడు · స్థాపితం: 1930
Longest Living Newspaper in Telugu Journalism

# జమీన్‌రైతు

సంపుటి: 81 • సంచిక: 13 • 26-3-2010 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

లేజర్ చికిత్స
కేర్
ఫోన్: 2303300

● మంత్రివర్గ విస్తరణ తర్వాత

## రాష్ట్ర రాజకీయం సంక్షుభితం?

**తొలగింపు జాబితాలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పీలేరు రామచంద్రారెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, డికె.అరుణ, బాలినేని శ్రీనివాసులురెడ్డి, రఘువీరా?**

మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం దగ్గర పడింది. ఎప్పుడో నాలుగు నెలల క్రితమే అధిష్టానం నుంచి అనుమతి తెచ్చుకొన్నాడు ముఖ్యమంత్రి. కానీ ఏదో ఒక అడ్డంకితో వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పుడా ఆటంకాలన్నీ అదృశ్యమై పోయాయి. ఉద్యమాలు లేవు, అలజడులు లేవు, ఆందోళనలు లేవు, శాసనసభ సాఫీగా నడిచి పోయింది. ప్రతిపక్షం సానుకూలంగా వుంది. కాంగ్రెస్‌వాదులు, మరీ ముఖ్యంగా మంత్రులు దారికి వచ్చారు. రోశయ్యతో పేచీ పెట్టుకొంటే ప్రమాదమన్న భీతితో మంత్రులు అపర బుద్ధిమంతుల వలె ఆయన కనుసన్నలలో మెలుగుతున్నారు. కేంద్ర నాయకత్వంలో కూడా రోశయ్య పట్ల నమ్మకం పెరిగింది. హైదరాబాద్ ఫ్రీ జోన్ వివాదంలో ఇటు జగన్ పక్షాన్ని, అటు ప్రతిపక్షాన్ని మాయ చేసి, బుజ్జగించి, దారికి తెచ్చుకొని, గొడవ లేకుండా అసెంబ్లీ తీర్మానం చేయించడం ద్వారా ఆయన అధిష్టానం మెప్పు పొందాడు. కనీసం మరికొంత కాలం ఆయన ఆంధ్ర వ్యవహారాలను చక్కబెట్టగలడన్న గురి కుదిరింది. మంత్రివర్గ విస్తరణకు ఇంతకంటే మంచి తరుణం వేరొకటి వుండదు కదా?

ఏప్రిల్ 2తేది ఢిల్లీ వెళ్తున్నాడు ముఖ్యమంత్రి. సోనియాగాంధీతో సహా అధిష్టాన దేవతలందరినీ దర్శించుకోబోతున్నాడు. అప్పుడే విస్తరణకు అనుమతి, జాబితాకు రాజముద్రిక వేయించుకొని వస్తాడని పరిశీలకుల వూహ. ఈ జాబితా ఎట్లా వుండబోతుందన్నదే ఇప్పుడు చర్చ. రోశయ్య మంత్రివర్గంలో వున్న మంత్రులంతా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్వంత మనుషులు. తన రాజకీయ అవసరాలు, అనుబంధాలు, ఆత్మీయతలు, నమ్మకాలు, నజరానాల ఆధారంగా మంత్రివర్గాన్ని రూపకల్పన చేశాడు వైఎస్. తాము వైఎస్ అనుచరులమన్న ధీమాతో కొందరు మంత్రులు రోశయ్య పట్ల ధిక్కార స్వభావంతో వ్యవహరించారు. ఆయన్ను ముఖ్యమంత్రిగా చూడడానికి ఇష్టపడలేదు. రామనారాయణరెడ్డి వంటి వారైతే రోశయ్య క్యాబినెట్‌లో పని చేయడం మా దురదృష్టం అని బహిరంగ ప్రకటనలు చేశారు. ఆ తర్వాత వచ్చిన పరిణామాల వల్ల వారిలో ముప్పాతిక భాగం మంది అదే రోశయ్యను ఆకాశానికెత్తి, ఆయన వంటి అనుభవజ్ఞుడి క్రింద పని చేయడం మా అదృష్టం అని మేర మెచ్చు మాట్లాడుతున్నారిప్పుడు.

ఈ రెండింటికి మధ్య తేడా తెలుసుకోలేని అమాయకుడు కాదు రోశయ్య. తన పట్ల అగౌరవంగా ప్రవర్తించిన వారికి బుద్ధి చెప్పడానికి, మంత్రివర్గాన్ని తన అభిప్రాయాలకు, అవసరాలకు అనుగుణంగా మలచుకోవడానికి ఇదొక అవకాశం ఆయనకు. వయస్సు పైనబడినందువల్ల కాబోలు, ఆయన ప్రభుత్వ నిర్వహణకు ఎక్కువ సమయం కేటా

కొరవ 14వ పేజీలో

### కార్టూన్ స్కేప్




మాడు పగలకుండా వుండటానికి
ఇలా వెళ్తారట సార్ ప్రజలలోకి...!

### అసలు దొంగలను పోలీసు తప్పించిందా?

ఇంటర్మీడియేట్ ప్రశ్నా పత్రాలను దొంగలించిన వివాదంలో జిల్లా పోలీసు యంత్రాంగం తీరు ప్రశ్నార్థకమౌతున్నది. కృష్ణ చైతన్య అనే ప్రైవేటు కళాశాల ఈ నేరానికి పాల్పడింది. పోలీసు అధికారులు తక్షణం స్పందించారు. టివి ఛానళ్లు గోల చేయడం కూడా అందుకొక కారణం కావచ్చు. కొంతమందిని అరెస్టు చేసి, జైలుకు పంపారు. ఇంతవరకు బాగానే వుంది. కానీ కళాశాల యాజమాన్యం జోలికి మాత్రం వెళ్లలేక పోయారు పోలీసు అధికారులు. ఆ యజమానులు జిల్లామంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రధాన అనచరులు కావడం అందుకొక కారణమేమో తెలియదు. అయితే ప్రశ్నా పత్రాల చోరీ ఉద్యోగులు, సిబ్బంది స్థాయిలో జరగదని పాలు త్రాగే పసి పిల్లవాడికి కూడా తెలుసు. యాజ

కొరవ 14వ పేజీలో




ఏ దేశ మేగినా ఎంతెత్తు కెదిగినా
జన్మభూమిని, 'జమీన్‌రైతు'ను
మరవక పోవడం
నెల్లూరీయుల సాంప్రదాయం

**పాఠకులకు ప్రత్యేక కానుక**

ఎనభైఏళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా ఆదరిస్తున్న పాఠకులకు ఈ కొత్త సంవత్సరంలో ప్రత్యేక కానుకగా "గ్లాస్" బౌల్ సెట్ అందిస్తున్నాము.

1-12-2009 నుండి 31-3-2010 మధ్య కాలంలో
చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!

**సంవత్సర చందా రూ.200/-** **జీవిత చందా రూ.1000/-**

చందా చెల్లించిన వెంటనే రశీదుతో పాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి. (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు స్కీమ్ కాలపరిమితి ముగిసేలోగా మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

**జమీన్‌రైతు**

వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పొగతోట, నెల్లూరు - 524 001. ఫోన్: 0861-2327354

సాహసోపేత వార్తా చిత్రిక - జమీన్‌రైతు వారపత్రిక

మేలుకోకుంటే...

# త్రాగునీటికి కటకటే!

**జిల్లాలో ప్రతి ఏడాది వేసవిలో త్రాగునీటి సమస్య తలెత్తుతున్నా తాత్కాలిక చర్యలు తీసుకొని చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారానికి ప్రయత్నాలు చేయడం లేదు!**



నెల్లూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఎప్పటికి పూర్తయ్యేను?

జిల్లావ్యాప్తంగా త్రాగునీటి సమస్య తీవ్రమౌతున్నది. వేసవికాలం వచ్చిందంటే ప్రజలకు ప్రధానంగా త్రాగునీటి సమస్య గుర్తుకొస్తుంటుంది. త్రాగునీటి ఎద్దడిని నివారించి ప్రజలకు ఇబ్బందిలేకుండా త్రాగునీటిని అందించాలని ప్రభుత్వం ముందుగానే అధికారులను హెచ్చరిస్తుంటుంది. అయినా కూడా అధికార యంత్రాంగంలో స్పందన కానరావడం లేదు. త్రాగునీటి ఎద్దడి నివారించేందుకు నిధుల కొరత లేదని ఒక ప్రక్క ప్రభుత్వం ప్రకటిస్తున్నా ప్రజాప్రతినిధులు సైతం ఈ విషయమై పట్టించుకోవడం లేదు.

## అడుగంటిన భూగర్భజలాలు!

జిల్లాలోని 46 మండలాలు, నెల్లూరు నగరం, కావలి, గూడూరు, వెంకటగిరి మునిసిపాలిటీలలో త్రాగునీటి ఎద్దడి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటి సమస్య పరిష్కరించే బాధ్యత



త్రాగునీటిని వంతులవారీగా పట్టుకోవాల్సిందే.

గ్రామ పంచాయితీలకుంటుంది. ప్రతి సంవత్సరం వేసవికాలంలో త్రాగునీటి ఎద్దడి తలెత్తుతున్నా ఏదో తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప ప్రత్యామ్నాయ ఏర్పాట్లు మాత్రం జరగడం లేదు. ఇప్పటికే ఎండలు అధికం కావడంతో బావులు, చెరువులలోని భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఏర్పడింది. దీనికి తోడు గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్‌కోత వేళాపాళా లేకుండా విధించడం కారణంగా ఎప్పుడు నీటి సరఫరా అవుతుందో తెలియడం లేదు.

## విద్యుత్ కోత

రోజుకు నాలుగు నుంచి ఐదు గంటల వరకు విద్యుత్‌కోత వుండడంతో నీటి సరఫరాకు విఘాతం ఏర్పడుతున్నది. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి త్రాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మునిసిపాలిటీలలో ఉదయం ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు విద్యుత్‌కోత వుంటుంది. ఈ సమయంలో నీటి సరఫరా అయ్యే అవకాశం లేదు. కోత విధిస్తున్న సమయంలోనే నీటి అవసరాలు వుండడంతో ఇబ్బందిపడక తప్పడం లేదు. ప్రధానంగా ఉద్యోగులు, బయట కూలీ పనులకు వెళ్లేవారికి మరింత ఇబ్బందికరంగా వుంటుంది. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికీ సక్రమంగా త్రాగునీటి సరఫరా జరగడం లేదు.

రెండు, మూడు రోజులకోసారి త్రాగునీటి సరఫరా జరగడం వల్ల బయట మార్కెట్లో లభించే వాటర్ క్యాన్లను కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మునిసిపాలిటీ కొళాయి కనెక్షన్‌లు పొందినవారు మోటార్‌లు బిగించి నీటిని అధికంగా వినియోగించుకుంటున్నారు. దీంతో వీధి కొళాయిలకు సరిగా నీరు సరఫరా కాకుండా పోతుంది. రెండు మూడు రోజులకోసారి కొళాయిలకు నీటి సరఫరా చేయడం వల్ల కొళాయిల వద్ద మహిళలు ఘర్షణ పడుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

## పేరుకే ట్యాంకర్లు

నగరంలోని కొన్ని ప్రాంతాలకు మునిసిపాలిటీకి చెందిన ట్యాంకర్ల ద్వారా త్రాగునీటి సరఫరా చేస్తున్నారు. ఇవి కూడా నిర్ణీత సమయానికి చేరుకోలేక పోతున్నాయి. త్రాగునీటి సరఫరా కోసం ఎంతో ఆశతో ఎదురుచూసిన మహిళలు విసుగుచెంది అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ శాపనార్థాలు పెడుతున్నారు. కావలి, గూడూరు మునిసిపాలిటీలలో కూడా ఇదే పరిస్థితి నెలకొని వుంది. రోజు రోజుకు మునిసిపాలిటీల పరిధి విస్తరిస్తున్న కారణంగా త్రాగునీటి అవసరాలు కూడా ఎక్కువగా వుంటున్నాయి.

## సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఎప్పుడు?

నెల్లూరు నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు నెల్లూరు చెరువులో సమ్మర్ స్టోరేజి ట్యాంకు నిర్మాణానికి ఐదు సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఈ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి 105 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగింది. ఈ ట్యాంకు అంచనాలను ప్రస్తుతం 120 కోట్లకు పెంచారు. పనులు ప్రారంభించి సంవత్సరాలు గడచిపోతున్నా నిర్మాణ పనులలో మాత్రం ప్రగతి కానరావడం లేదు. పనులను పర్యవేక్షించే ప్రజా సాంకేతిక విభాగం అధికారులు దీనిపై ఎందుకో ప్రత్యేక దృష్టి సారించలేక పోతున్నారు. త్రాగునీటి సమస్య ముంచుకొస్తున్నా నగర ప్రజలకు ప్రజాప్రతిధులుగా వ్యవహరిస్తున్న ఇద్దరు ఎమ్మెల్యేలు కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితమవుతూ ప్రజల ఇబ్బందుల గురించి పట్టించుకోవడం లేదు.

కోట్ల రూపాయల పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కూడా బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరగడం లేదన్న కారణం చూపి పనులు పూర్తి చేయడంలో అశ్రద్ధ చూపుతున్నారు. ఇకపోతే గ్రామీణ ప్రాంతాల ప్రజల పరిస్థితి మరింత దయనీయంగా తయారయ్యే ప్రమాదం ముంచుకొచ్చింది. కొళాయిల ద్వారా త్రాగునీరు రెండు రోజులకోసారి గ్రామాలకు సరఫరా అవుతుంది. బోగోలు, ఆత్మకూరు, చిల్లకూరు, అల్లూరు, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు మండలాల్లో త్రాగునీటి ఎద్దడి తీవ్రంగా వుంది. అల్లూరు మండలంలో రాయపేట, శింగపేట, అల్లూరు ప్రాంతాలలో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు.

తోటపల్లిగూడూరు మండలంలో కోడూరు, మండపం, వెంకన్న పాళెం గ్రామ పంచాయితీలలో ఇదే పరిస్థితులు నెలకొని వున్నాయి. పంచాయితీ పాలకవర్గం ఏదో సాకు చూపించి సమస్య నుంచి తప్పించుకోజూస్తున్నది. ఆత్మకూరులో అయితే అయిదు రోజులకోసారి నీటి సరఫరా అవుతుండడంతో ప్రజలు నానా అవస్థలు పడక తప్పడం లేదు. త్రాగునీటి సరఫరా ఎందుకు జరగడం లేదని ప్రజలు ప్రశ్నిస్తే మోటార్లు కాలిపోయాయని, లేదా మరమ్మత్తులకు గురికాబడ్డాయని, విద్యుత్ కోత వుంటుందని రకరకాలుగా డొంక తిరుగుడు సమాధానాలు చెబుతున్నారని వాపోతున్నారు.

## పనిచేయని గ్రామీణ త్రాగునీటి సరఫరా విభాగం!

జిల్లావ్యాప్తంగా త్రాగునీరు సరఫరా చేసేందుకు గ్రామీణ త్రాగునీటి సరఫరా విభాగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ విభాగం అధికారులు వాటర్ స్కీంను ఏర్పాటు చేయడం బోర్లు వేయడం వరకే పరిమితమై పోతున్నారు. ప్రజలకు త్రాగునీటి సరఫరా చేసే బాధ్యతను గ్రామ పంచాయితీలకే అప్పగిస్తుంటారు. త్రాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం కోట్ల రూపాయలు విడుదల చేస్తున్నా ఈ నిధులలో సగభాగం కాంట్రాక్టర్లు, అధికారుల జేబుల్లోకి వెళ్తున్నాయి తప్ప నీటిఎద్దడి మాత్రం పరిష్కారం కావడం లేదు.

తీర ప్రాంతాల గ్రామాలలో రెండు, మూడు రోజులకోసారి నీటి సరఫరా అవుతుండగా మెట్ట ప్రాంతాల ప్రజలకు మరీ దారుణంగా వుంటుంది. మెట్ట ప్రాంతాలలో రక్షిత మంచినీటి పథకాలు ఆశించినంతగా లేవు. వున్నా కూడా సక్రమంగా పనిచేయవు. ఇక్కడ ప్రజలు ఎక్కువగా బావులపైనే ఆధారపడాల్సి వుంటుంది. కొన్ని గ్రామాలలో వేసవికాలంలో భూగర్భజలాలు అడుగంటిపోయే అవకాశం వుండడంతో గుక్కెడు నీటికోసం అల్లాడిపోతారు. ఈ ప్రాంతాల్లోని బావులు దాదాపు వంద నుంచి రెండు వందల అడుగుల లోతు వుంటాయి. వేసవికాలంలో కొన్ని బావులు ఎండిపోతే గ్రామాలకు దూరంగా వున్న వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి తెచ్చుకుంటారు.

జిల్లా పరిషత్, మునిసిపాలిటీ పాలకవర్గం త్రాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తుంటారు. అయినా కూడా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలం చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజల అవసరాలను దృష్టిలో వుంచుకుని త్రాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాల్సి అవసరం వుంది.



ఈ సేవా కేంద్రంలో కొత్త గ్యాస్ కనెక్షన్లు, సిలిండర్లు ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకొనే పనిని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్.

# వెంకటగిరి స్కూళ్లలో పలు సమస్యలు

## ● కురుగొండ్ల స్పందించాలి

వెంకటగిరి పట్టణంలో విద్యాలయాలు సమస్యల నిలయాలుగా మారాయి. చదువుకొనేందుకు పాఠశాలలకు వచ్చే విద్యార్థులు సమస్యలతో సహవాసం చేయాల్సి వస్తోంది. కనీస సౌకర్యాలకూ నోచుకోని పాఠశాలలు అనేకం వున్నాయి. నిధులు లేక కొన్ని, నిధులున్నా సౌకర్యాల కరువై మరికొన్ని పాఠశాలలు కొట్టుమిట్టాడుతున్నాయి. అతిపెద్ద సంఖ్యలో 1600మంది విద్యార్థినులున్న జడ్పీ బాలికల ఉన్నతపాఠశాలలో తగినన్ని గదులు లేకపోవడంతో పిల్లలు పలు ఇబ్బందులు పడుతున్నారు. భవనం ముఖద్వారం కూలిపోయే స్థితికి చేరుకొని వుంది. జడ్పీ బాలుర ఉన్నతపాఠశాల ఆక్రమణలకు గురైంది. దానిని సైతం కబ్జా చేయడంతో పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు అవస్థలు పడాల్సివస్తోంది. 800 మంది పిల్లలు వుండే ఈ స్కూలులో కనీససౌకర్యాలు కరువైనాయి. బడి మానేసిన పిల్లల కోసం ఏర్పాటుచేసిన కస్తూర్బా బాలికల విద్యాలయానికి భవనాల కోసం అప్పటి మంత్రి రాజ్యలక్ష్మి 38లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించినా నిర్మాణాలు పూర్తి కాలేదు. నియోజకవర్గంలోని పలు పాఠశాలల పరిస్థితి ఇలాగే వున్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ప్రతి ఏడాది సమస్యలను ఎదుర్కొంటూనే వున్నారు.

# గూడూరు బస్టాండ్‌లో దొంగలు

గూడూరు ఆర్టీసి బస్టాండులో దొంగతనాలు అధికం కావడంతో ప్రయాణీకులు హడలిపోతున్నారు. శ్రీకాళహస్తికి ప్రయాణిస్తున్న ఒక మహిళకు సంబంధించిన బ్యాగును దొంగిలించారు. బంగారు, నగదు వుండడంతో బ్యాగు పోగొట్టుకొన్న మహిళ ఆవేదన అంతా ఇంతా కాదు. మరో ముస్లిం మహిళ చెవిలోని కమ్మలు దొంగతనానికి గురయ్యాయి. తిరుపతికి చెందిన యువతి బ్యాగు ప్రక్కనపెట్టి మంచి నీళ్లు త్రాగుతుండగా దొంగిలించుక వెళ్లారు. ఇక సెల్‌ఫోన్‌లు, జేబు కత్తిరింపుల సంగతి చెప్పనవసరం లేదు.

## పోలీస్ ఔట్‌పోస్ట్ పెట్టాల్సిందే!

రోజూ ఒకరిద్దరు ప్రయాణీకులు తమ వస్తువులు, నగలను పోగొట్టుకొంటూనే వున్నారు. ముఖ్యంగా బస్టాండులో పోలీస్ ఔట్‌పోస్టు లేనందువల్లనే ఇలాంటి దొంగతనాలు జరుగుతున్నాయని ప్రయాణీకులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా వుండే కొందరు ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికైనా ప్రయాణీకుల భద్రతను దృష్టిలో వుంచుకొని పోలీస్‌ఔట్ పోస్టును ఏర్పాటు చేయాల్సి వుంది.

# కలువాయి ఎమ్మార్వో బదలీ

## స్వీట్లు పంచిన జనం

తలబిరుసుతనంతో మండల ప్రజల్లో అపవాదు మూటగట్టుకొన్న తహశీల్దార్ బాలకృష్ణారెడ్డి బదలీ అయ్యాడు. ప్రజాప్రతినిధుల పట్ల గౌరవం లేకుండా వ్యవహరించడంతో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్పీ చింతామోహన్ సైతం తహశీల్దార్‌పై ఆగ్రహించిన సంగతి తెలిసిందే. తన అవినీతి, దురుసుతనాన్ని బయటపెడతారనే భయంతో విలేకరులపైనే తప్పుడు కేసులు పెట్టించి భ్రష్టుపట్టిన ఆయన్ను జిల్లా కలెక్టర్ రాంగోపాల్ బదలీ చేశారు. గిరిజన సంక్షేమశాఖ ఏపీఓగా నియమించారు. క్రొత్త తహశీల్దార్‌గా శ్రీనివాసులును మండలానికి పంపడంతో పలు వర్గాల వారు కలెక్టర్‌ను ప్రశంసిస్తున్నారు. కొందరు ఏకంగా మిఠాయిలు పంచారంటే బాలకృష్ణారెడ్డి ఎంత తలబిరుసుగా వ్యవహరించింది అర్థమవుతుంది.

# కోవూరు ఆస్పత్రిలో వైద్యసేవలు పూజ్యం

ఇంటిపేరు కస్తూరివారు ఇల్లంతా గబ్బిలాల కంపు అన్న చందంగా వుంది కోవూరులోని ప్రభుత్వ వైద్యశాల పరిస్థితి. పేరుకు 30 పడకల ఆస్పత్రి అయినా వైద్యసేవలు మాత్రం పూజ్యం. సమీప గ్రామాల్లోని ప్రజానీకానికి వైద్య, ఆరోగ్య సేవలు అందించేందుకు దశాబ్దాల క్రిందట కోవూరులో ప్రభుత్వ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు కనీస వైద్య సౌకర్యాలు కల్పించడంలో ఆస్పత్రి విఫలమైంది. అత్యవసర వైద్య చికిత్సలకు వచ్చే వారి కోసం ఏర్పాటు చేసిన ఎక్స్‌రేమిషన్ పని చేయక మూలపడడంతో యాక్సిడెంట్లు ఇతర ప్రమాదాలకు గురైనవారికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రాణాప్రాయ స్థితిలో వున్నవారు ఈ ఆస్పత్రికి వస్తే నరకం చూడాల్సి వస్తోంది. తగిన వైద్యచికిత్సలు అందించేందుకు అవసరమైన సదుపాయాలు లేకపోవడంతో నెల్లూరుకు తరలించాల్సి వస్తోందని పలువురు ప్రజలు వాపోతున్నారు. గత ఆరు నెలలుగా ఎక్స్‌రేను బాగు చేయించేవారు లేకుండా పోవడంతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆస్పత్రి నిష్ప్రయోజనమవుతున్నాదని మండల ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.



## వాస్తు ఖర్చు అక్షరాలా కోటి



ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో వాస్తు మార్పులకు కోటిరూపాయలు ఖర్చయ్యాయట. వై.ఎస్ ప్రమాదంలో మరణించడానికి క్యాంపు కార్యాలయం వాస్తు దోషమంటూ కొందరు వంక పెట్టారు. దీంతో క్యాంపు కార్యాలయంలో అడుగుపెట్టడానికి రోశయ్య జంకాడు. మొత్తం మీద వాస్తు నిపుణుల సూచనపై కొన్ని మార్పులు - చేర్పులు చేశాక రోశయ్య కార్యాలయంలో అడుగుపెట్టారు. తీరా కార్యాలయం మార్పుల ఖర్చు చూస్తే తడిసి మోపెడైంది. పదికోట్ల రూపాయలకు పైగా ఖర్చు పెట్టి నిర్మించిన కార్యాలయంలో తిరిగి కోటి రూపాయలుదాకా ఖర్చుచేయడాన్ని రాజకీయులు కథలు కథలుగా చెప్పుకొంటున్నారు - వింటున్నారా రోశయ్యా!

## లీకుల ముఖ్యమంత్రి



ప్రభుత్వ సమాచారాన్ని అవసరమైనప్పుడు అనధికారికంగా 'లీకు' చేయడం ఆనవాయితీ. దీనికోసం ముఖ్యమంత్రి పేషీలో ప్రత్యేక వ్యవస్థ కూడా వుంటుంది. రోశయ్య మాత్రం ఇందుకు మినహాయింపుగా కనబడుతున్నారు. ఏదైనా సమాచారం 'లీకు' చేయడానికి ఆయన ఎవరి మీద ఆధారపడకుండా సొంతంగానే పని చక్కబెట్టుకుంటున్నాడట. ఆ మధ్య 'జగన్‌కు రోశయ్యకు మధ్య కడవ నేతల రాజీ' పేరుతో ఒక వార్త పతాక శీర్షికల్లో కనిపించింది. ఈ వార్త మీడియాకు ఎలా లీకైందంటూ సిఎం పేషీ అధికారులంతా తలపట్టుకున్నారట. అలాగే సిఎం చుట్టూ మంత్రుల ప్రదక్షిణ పేరుతో మరునాటి రోజు మరో వార్త వచ్చింది. దీంతో సిఎం పేషీ ఆరాతీసిందట. తీరా చూస్తే ఆవార్తల్ని లీకు చేసింది స్వయానా ముఖ్యమంత్రేనని తెలిసింది. మొత్తానికి మన ముఖ్యమంత్రి 'లీకువీరుడే' అంటూ పేషీ అధికారులు జోకులు వేసుకున్నారట.

## ముఖ్యమంత్రికి కరెంట్ కట్



రాష్ట్రంలో కరెంటు కోత చేదు అనుభవం ప్రజలకే కాదు సాక్షాత్తు ముఖ్యమంత్రికి కూడా ఎదురైంది. హైదరాబాదులో ఏర్పాటైన ఓ ప్రదర్శనను ప్రారంభించడానికి వచ్చిన ముఖ్యమంత్రి కరెంటు కోత కారణంగా కొంతసేపు ఉక్కబోతకు గురికాక తప్పలేదు. ప్రదర్శన ప్రారంభించడానికి సిద్ధమౌతున్న సమయంలో ఒక్కసారిగా లైట్లు ఆరిపోయాయి. ఫ్యాన్లు బంద్ అయ్యాయి. దీంతో అక్కడున్న భద్రతా సిబ్బంది, నిర్వాహకులు అవాక్కయ్యారు. వెంటనే ట్రాన్స్‌కో అధికారులకు ఫోన్లు చేశారు. ముఖ్యమంత్రిగారికి కోపం వస్తుందంటూ నానా హడావుడి చేశారు. ఈలోగా జనరేటర్ వేశారు. ఆ తర్వాత మెల్లగా కరెంటు కూడా వచ్చింది. అలా అమ్మయ్య అంటూ అందరూ ఊపిరిపీల్చుకున్నారు. రోశయ్య మాత్రం కరెంటు పోయినందుకు కొద్దిగా ఫీలయ్యారు. కాసేపు కోతకు గురైన రోశయ్యకు గంటల కొద్దీ రాష్ట్ర ప్రజలు పడుతున్న ఇబ్బందేమిటో తెలిసొచ్చి వుండాలి.

## 'సాక్షి'కి కష్టాలు మొదలు




సాక్షి దినపత్రిక, టి.వి. ఛానల్‌కు కష్టాలు మొదలయ్యాయట. ఓబులాపురం గనులకు సంబంధించి ముఖ్యమంత్రి ఉక్కుపాదం మోపుతుండడంతో జగన్ ఆదాయంపై బాగా ప్రభావం పడిందట. గనులశాఖ డైరెక్టర్ రాజగోపాల్‌కు ఉద్వాసన చెప్పడంతో గాలి జనార్దన్‌రెడ్డి, జగన్‌ల ప్రయోజనాలకు భంగం కలిగింది. తవ్విన కొద్దీ కోట్లాది రూపాయల ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న ఓబులాపురం గనులపై ఆధిపత్యం తప్పితే జగన్ ఆధ్వర్యంలో వున్న 'సాక్షి' పత్రిక, ఛానల్‌కు కష్టాలు తప్పవంటున్నారు. ఓబులాపురం 'సాక్షి'గా జగన్ ఏం చేస్తాడో చూడాలి.

## మీది తెనాలె - మాది తెనాలె!



తెలుగుదేశం ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి సెలక్షన్స్ - కలెక్షన్స్ పేరుతో నగరంలో ఓ ప్రదర్శనను ఏర్పాటు చేసింది. ఇందులో తాను సేకరించిన అరుదైన చీరలు, అలంకార వస్తువుల్ని ఉంచింది. ఈ ప్రదర్శనను ముఖ్యమంత్రి రోశయ్య ప్రారంభించారు. అక్కడకు వచ్చిన అతిథులందరికీ ఓ అనుమానం వచ్చింది. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడికి బదులు రోశయ్యను పిలవడంలో ఆంతర్యమేమిటబ్బా అంటూ వారు ఆరాతీశారు. తీరా చూస్తే నన్నపనేని, రోశయ్య ఇద్దరూ తెనాలి వాస్తవ్యులని తేలింది. ఎంతైనా మీది తెనాలె - మాది తెనాలె అంటూ అందరూ విరగబడి నవ్వుకున్నారట. రాష్ట్రంలో రోశయ్య ముఖ్యమంత్రి అయిన దగ్గర నుంచి నన్నపనేని ప్రవర్తనలో మార్పు వచ్చిందంటూ అక్కడున్న తెలుగుదేశం నాయకులు గుసగుస లాడుతున్నారట. అవును మరి ఎంతైనా 'తెనాలి' వాళ్ల కదా!

## అయిననూ పోయిరావలె... హస్తినకు!!



రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు చేర్పులు చేయడానికి ఈ నెలాఖరున రోశయ్య ఢిల్లీకి వెళ్తున్నారు. మంత్రివర్గం మార్పులకు ఇప్పటికే అధిష్టానం రోశయ్యకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే లాంఛనంగా అధినేత్రి ఆమోదం కోసం ఆయన ఢిల్లీకి వెళ్తున్నారు. అందరూ ఊహించినట్లుగా కాకుండా ఈసారి మార్పుల్లో రోశయ్య ముద్ర తప్పక కనిపిస్తుందని ఆయన సన్నిహిత వర్గాల కథనం. అయితే రాష్ట్ర రాజకీయాల్లో కుల, వర్గ సమీకరణలకు భంగం రాకుండా చూడాల్సిందిగా అధిష్టానం అంటోంది. ఇందుకు అనుగుణంగా తన సొంత మనుషులకు బెర్తులు ఖాయం చేసుకోడానికే రోశయ్య ఢిల్లీకి వెళ్తున్నట్లు భోగట్టా; అన్నీ కుదిరితే వచ్చే నెల మొదటి వారంలో మార్పులు - చేర్పులు ఉండొచ్చు.

